www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 ఫిబ్రవరి 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

'శ్రీనివాస' కళాశాల్లో ప్రాజెక్ట్ నమూనా ప్రదర్శన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల్లో ఐటిఐ విద్యార్థుల సమాఖ్యచే రూపొందించబడిన వివిధ ప్రాజెక్ట్ నమూనాల ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ వివిఎస్.పరమేశ్వర రావు శనివారం ప్రారంభించారు. తృతీయ సంవత్సరం ఐసిఇ విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్ ల నమూనాల్ని ప్రదర్శించారు. మొదటి మూడు ఉత్తమ ప్రాజెక్ట్ నమూనాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డివిఎస్.వర్మ, పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

- పూర్తికాని అదనపు పాఠశాలల భవనాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-మండపేట

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మనబడి నాడు-నేడులో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన అదనపు తరగతులు నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. ఈ భవనాల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయయని విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆసగా ఎదురుచూస్తున్నారు. మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 68 పాఠశాలలు ఉండగా మొదటి విడతలో 24 పాఠశాలలను ప్రభుత్వం ఇప్పటికే అభివృద్ధి చేసింది.

రూ.8.75 కోట్లతో అదనపు తరగతుల నిర్మాణం

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు, పాఠశాలల విలీనం నేపథ్యంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య, తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని మనబడి నాడు-నేడులో భాగంగా సుమారు రూ.8.75 కోట్ల అంచనాలతో 13 పాఠశాలలు, 9 అంగన్‌వాడీల భవనాల నిర్మాణ పనులు మొత్తంగాను ప్రభుత్వం చేపట్టిన 71 అదనపు తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పట్టణంలో జిల్లా పరిషత్ బాలకోన్నత, గొల్లపుంత, సత్యశ్రీ సెంటర్‌లోని సర్దార్ శ్రీవేగుళ్ల వీర్రాజు, శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాలలు కాగా మండలంలోని ద్వారపూడిలో జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలతోపాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెలగతోడు, తాపేశ్వరం, కేశవరం, ఉన్నత పాఠశాలలు, ఏడిద, చిన్నద్వారపూడి, మెర్నిపాడులలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలతో పాటు ద్వారపూడిలో 5, కేశవరంలో 3, చినద్వారపూడిలో ఒకటి అంగన్‌వాడీ భవనాలు మొత్తంగాను 71 తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పునాదుల నుంచి నిర్మిస్తున్న ఒక్కోక్క తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం రూ.13.5 లక్షలు, శ్లాబ్‌పైన అయితే రూ.12 లక్షలు నిధులు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు సుమారుగా రూ.4 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. అయితే వీటిలో కొన్ని భవనాలు శ్లాబ్ పనులు పూర్తికాగా మరికొన్ని శ్లాబ్ వరకు వచ్చి మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్నింటికి విద్యుత్, కిటికీలు, గుమ్మాలు తదితర పూర్తికావాల్సిఉంది.



ద్వారపూడిలో పూర్తికాని అదనపు తరగతుల భవనాలు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తరగతి గదుల భవనాల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలు, రేకుల షెడ్లలోను తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో సౌకర్యాల లేమితో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మరో పక్క నిర్మాణ పనులకు వినియోగించాల్సిన సామగ్రి పాడైపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అదనపు తరగతుల భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు



పెరిగిన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మనబడి నాడు నేడులో కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సిఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను ఉన్నాతాధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

-సిహెచ్.వెంకట సామిరెడ్డి, ఎంఇఒ, మండపేట

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఇఒలకు వినతి పత్రాలు

ప్రజాశక్తి-అమలాపురం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం రామచంద్రపురం, అమలాపురం, మల్కిపురం, కొత్తపేట మండలాల్లో ఎంఇఒలకు యూనియన్ అధ్యక్షురాలు కె.సత్యవేణితో కలిసి మధ్యాహ్న భోజన కార్మికులు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోందన్నారు. అయితే గత 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయిస్తున్నాయన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ రూ.10 వేల వేతనం, ప్రతి నెల 5 వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20కు పెంచాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, వంటచేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైనటువంటివారికి నష్టపరిహారం చెల్లించాలని, స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు మంచినీరు, వంటషెడ్, గ్యాస్టవ్ ప్రభుత్వమే కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, మట్టి ఖర్చులు (దహన సంస్కారాలకు) ఇవ్వాలని, మెటర్నిటీ బెనిఫిట్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశామన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రహదారి భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురంలోని రాజారత్న కిట్స్ కళాశాల్లో శనివారం రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. రోడ్లు ప్రయాణాలపై అతివేగంపై విద్యార్థులకు ఆర్‌టిఒ ఆర్.రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.పవన్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి.బర్ల, సాయి కాంత్, రవీందర్, శ్రీకాంత్, రామారావు తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు(ఇన్‌సెట్)లోమాట్లాడుతున్న ఆర్‌టిఒరాజేంద్రప్రసాద్

తహశీల్దార్ వైద్యనాథశర్మకు సత్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో తహశీల్దార్ గా పనిచేస్తున్న వైద్యనాథ శర్మ అమలాపురం బదిలీపై వెళ్లారు. మండల విఆర్‌ఒలు, కార్యాలయం సిబ్బంది, సర్వేయర్, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఇక్కడకు గోపాలపురం నుంచి బి.రవీంద్రనాథ్ తహశీల్దార్‌గా కె. గంగవరం బదిలీపై వచ్చారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని జూనియర్ కళాశాల్లో ఉపాధ్యాయులకు వత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించారు. డైరెక్టర్ వీర రాఘవరెడ్డి, ఎంఇఒ నాగేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 6 వ తరగతి నుంచి 10 తరగతి బోధించే భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతుల్లో పెట్ సిమ్యులేషన్ ,ఓ లాబ్ సిమ్యులేషన్, ఆన్లైన్ లో నిర్వహించే విధానం చాట్ జిపిటి, జియో జీబ్రా, ఏఐటూల్ ,వివిధ రకాల ప్రయోగాలను ఏ విధంగా ఆన్లైన్లో నిర్వహించుకోవచ్చు అనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో పరిశీలకులుగా ఐఆర్టి కోఆర్డినేటర్ నారాయణ, రిసోర్స్ పర్సన్ ప్రక్కి వీర బ్రహ్మానందం, కోడి ప్రసాద్, రామకష్ణ ఇనుమర్తి ప్రసాద్, గుంటముక్కల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాము

మండపేట మున్సిపల్ కమిషనర్‌గా రాము

ప్రజాశక్తి-మండపేట

మండపేట మున్సిపల్ కమిషనర్‌గా బొడ్డేపల్లి రాము శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా విశాఖపట్నం జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన మండపేటకు వచ్చారు. మున్సిపల్ మేనేజర్ తాతపూడి కనకరాజు, ఆర్‌ఒ శర్మ, ఆర్‌ఐ వంక ప్రభాకర్ చౌదరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య తదితరులు ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. రాము గతంలో పలాస, రాజాం, పిఠాపురం, పాలకొండ, ఆముదాల వలసలో కమిషనర్‌గా, అనకాపల్లి, విశాఖ జివిఎంసి జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్ టి.రామకుమార్ ధర్మవరం బదిలీఅయ్యారు.

కమిషనర్ రాముకు సురుచి సత్కారం

కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బొడ్డేపల్లి రామును తాపేశ్వరం మడత కాజా మాత సంస్థ సురుచి పిఆర్‌ఒ వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్ రామును శాలువాతో సత్కరించి బాహుబలి కాజాను బహూకరించారు.

కార్టూన్‘నిజం’



నిందితులను శిక్షించాలని డిమాండ్

తహశీల్దార్ రమణయ్య హత్యను ఖండించిన రెవెన్యూ ఉద్యోగ సంఘాలు

విశాఖ రూరల్(చినగదిలి) తహశీల్దార్ సనపల రమణయ్య హత్యను డాక్టర్‌బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగ సంఘాలు శనివారం ఖండించాయి. హత్యకు కారకులైన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కపిలేశ్వరపురం విశాఖ రూరల్ (చినగదిలి) తహశీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని రెవెన్యూ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం తహశీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ కపిలేశ్వరపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మండల వీఆర్వోలు వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** విశాఖ జిల్లా చినగదిలిలో హత్యకు గురైన తహశీల్దార్ సనపల రమణయ్య మృతికి రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. ఆర్ఐ శివ ప్రసాద్, తహశీల్దార్ బి.ముక్తేశ్వర రావు రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, విఆర్‌ఒలు, విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** విశాఖ రూరల్(చినగదిలి) తహశీల్దార్ సనపల రమణయ్య దారుణ హత్యను విఆర్‌ఒల సంఘం రాష్ట్ర నాయకులు మద్దాల బాపూజీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రమణయ్య ను హత్యచేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



కపిలేశ్వరపురంలో నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు



రాజోల్లో రమణయ్య చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న ఉద్యోగులు

'సిద్ధం' సభకు తరలిన వైసిపి శ్రేణులు

ఉమ్మడి పశ్చిమగోదావరి ఏలూరు జిల్లాలోని శనివారం దెందులూరులో జరిగిన 'సిద్ధం సభ'కు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి వైసిపి శ్రేణులు వాహనాల్లో తరలివెళ్లారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మండపేట ఉమ్మడి పశ్చిమగోదావరి ఏలూరు జిల్లాలోని దెందులూరులో జరిగిన 'సిద్ధం మహాసభ'కు మండపేట నియోజకవర్గం నలుమూలల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు సమక్షంలో ప్రభుత్వ, ప్రయివేటు వాహనాల్లో దెందులూరు తరలి వెళ్లారు. **ఆలమూరు** మండల వైసిపి కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో దెందులూరులో జరిగే సిద్ధం బహిరంగ మహాసభకు 30 బస్సులు, 30 కార్లతో ఆ పార్టీ శ్రేణులతో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట అడబాల వీర్రాజు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్, తమ్మన హరి, బి వీర వెంకట్రావు, తదితరులు ఉన్నారు. **ఉప్పలగుప్తం** సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైసిపి శ్రేణులు తరలి వెళ్లారు. వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి బస్సులు కార్లు ఇతర వాహనాలలో తరలి వెళ్లారు. తరలి వెళ్ళిన వారిల జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపిపి సాదే శ్రీను, డాక్టర్ వైయస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్ లు ఎంపిటిసి సభ్యులు తదితరులు ఉన్నారు.



ఉప్పలగుప్తం నుంచి తరలి వెళ్తున్న వైసిపి శ్రేణులు



ఆలమూరులో జెండా ఊపుతున్న తమ్మన శ్రీనివాస్

'తొత్తరమూడి' మృతి తీరని లోటు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అంబాజీపేట మండల ఎమ్ఆర్‌పిఎస్ అధ్యక్షులు తొత్తరమూడి హృదయ కృష్ణ అకాల మృతి ఉద్యమానికి తీరనిలోటని ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు అన్నారు. నంగవరంలో శనివారం ఎమ్ఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. హృదయ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి, గణపతిరావు, శ్రీనివాసరావు, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంగాయమ్మ పార్థీవదేహం వద్ద టిడిపి నేతల నివాళి

రాష్ట శెట్టి బలిజ సాధికార సమితి డైరెక్టర్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి -మామిడికుదురు

రాష్ట శెట్టిబలిజ సాదికారసమితి టిడిపి డైరెక్టర్, మండల టిడిపి అధ్యక్షులు మొలేటి శ్రీనివాస్ (ఎంఎస్) మాతృమూర్తి మంగాయమ్మ (81) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె పార్థీవదేహన్ని శనివారం అమలాపురం పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ గంటి హరీష్ మాధుర్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు మద్దాల కష్ణమూర్తి (పెద్దకాపు), బోణం బాబు, వర్థినేని వెంకటరామయ్య, సూదా బాబ్జి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

టిడిపి ఆధర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట గ్రామ శివారు చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రచార ఆర్భాటం తప్ప వైసీపీ పాలనలో అభివద్ధి లేదన్నారు. కొత్తపేట అభివృద్ధి అంతా టిడిపి హయాంలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

'పిఎస్' టీచర్స్ ఫోరం ఉపాధ్యక్షునిగా స్వామి ప్రసాద్

ప్రజాశక్తి-మండపేట

ఎపి ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా శాఖ ఉపాధ్యక్షునిగా మండలంలోని ద్వారపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గండి స్వామి ప్రసాద్ శనివారం ఎన్నికయ్యారు. రామచంద్రపురంలో జరుగుతున్న డివిజన్ స్థాయి సైన్సు ఉపాధ్యాయుల ఓరియెంటేషన్ శిక్షణా తరగతుల్లో స్వామి ప్రసాద్‌ను జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సుబ్రహ్మణ్యం, కోర్సు డైరెక్టర్ వీర రాఘవరెడ్డి డివిజన్లోని సైన్స్ రిసోర్స్ పర్సన్‌లు, సైన్సు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు మామిడి సత్యనారాయణ, ఇనుమర్తి ప్రసాద్, గుడ్ల పట్టాభి, నల్లాన్ చక్రవర్తుల రామానుజం, రామకృష్ణ, గొడవర్తి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




స్వామి ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిద్ధం సభకు స్కూల్ బస్సుల మళ్లింపు దారుణం

ప్రజాశక్తి-రాజోలు

సిద్ధం సభ పేరుతో అర్థాంతరంగా స్కూళ్లకు సెలవులు ఇచ్చేసి బస్సులు అటు మళ్లించడం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని టిడిపి వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ ఆరోపించారు.శనివారం రాజోలు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభలు పెడుతుంటే బడి పిల్లలను ఇంటికే పరిమితం చేయడం ఏంటన్నారు. దీనివల్ల పిల్లలకు సమస్య అవుతుందన్నారు. విద్యా బోధనలో ఆటంకం ఏర్పడుతోందన్నారు. .నేతల పర్యటనల కోసం, సిఎం సభల కోసం పాఠశాలలు మూతవేసే ధోరణి అదుపు చేయాలన్నారు. సిద్ధం పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని ప్రయివేటు పాఠశాలలు మూసివేసి స్కూల్ బస్సులను తరలించడం దారుణమన్నారు.



బోళ్ల వెంకట రమణ

అచ్చెన్నాయుడును కలిసిన మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో రామచంద్రపురం నియోజకవర్గం మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కింజరపు అచ్చెన్నాయుడును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి నుంచి ఎంఎల్‌ఎ అభ్యర్థి గా తనకు అవకాశం ఇవ్వాలని నాగేశ్వరరావు కోరారు. రామచంద్రపురం నియోజకవర్గంలో తాను 12 సంవత్సరాలు నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా పోరాట కార్యక్రమాలు మా సంఘం సభ్యులు సహకారంతో చేశానని అన్నారు. మైనార్టీ బిసి సంఘం తో బాటు నియోజకవర్గం లో ఉన్న అన్ని సామాజిక వర్గాలు మద్దతు తనకు ఉంటుందని మరియు నియోజకవర్గం లోని పరిస్థితులు అచ్చెన్నాయుడుకు వివరించానని తెలిపారు. ఈ విషయంపై అచ్చెన్నాయుడు స్పందించి రామచంద్రపురం నియోజకవర్గం టిక్కెట్ విషయం గురించి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

గ్రేడ్-2 విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులపై హర్షం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఉమ్మడి జిల్లాల్లో 101 మంది విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు కల్పించడం పట్ల విఆర్‌ఒ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్-1 విఆర్‌ఒలుగా పదోన్నతి కల్పించుటకు జిఒ 166 సాధించుటలో కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరాజుకు అభినందనలు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రేడ్-2 గ్రామ రెవిన్యూ అధికారులకు సీని యారిటీ లిస్ట్ పబ్లికేషన్ చేయించుటలో కృషి చేసిన కాకినాడ గ్రామ రెవెన్యూ అధికారుల జిల్లా అధ్యక్షులకు తదితరులకుఅభినందనలు తెలియజేశారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యార్థుల చదువులో అంబేద్కర్ ఆలోచన విధానాలను పాటించాలని అన్న మినిస్ట్రీస్ మినిస్ట్రీస్ అధినేత పి.గన్నవరం పూర్వపు ఎంపిడిఒ ఐఇ.కుమార్ అన్నారు. అవిడి గ్రామపంచాయతీ పరిధిలోని చప్పుడివారిపాలెం హైస్కూల్ నందు రిపబ్లిక్ డే సందర్భంగా డ్రాయింగ్ పోటీల్లో పెన్సిల్తో జాతీయ పతాకం రూపొందించిన విద్యార్థులను శనివారం అన్న మినిస్ట్రీస్ మరియు మమత స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో హెచ్ఎం కుంచే అరుణశ్రీ చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ అందించారు. మమత స్వచ్ఛంద సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ మాట్లాడారు. డ్రాయింగ్ టీచర్ నక్క కృష్ణ ప్రసాద్‌ను అభినందించారు భోజనం తయారు చేసే అవ్వలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊడిమూడి ఎంపిటిసి సభ్యులు ఆదిమూలం సూరయ్య కాపు, అంబేద్కర్ సాహితీ సమితి అధ్యక్షులు నేలపూడి రామకృష్ణ, నరేంద్రపురం పంచాయతీ టైపిస్టు కుసుమ ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌లు అందుకుంటున్న విద్యార్థులు

పేకాట శిబిరంపై దాడి.. ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కడియం

మురమండ గ్రామ శివారు రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్నపేకాట శిబిరంపై శనివారం తెల్లవారుజామున కడియం సిఐ బి.తులసిధర్, ఎస్ఐ అశ్ఫాక్ తమ సిబ్బందితో జరిపిన దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఐదుగురు పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఘటన స్థలంలో ఒక కారు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు చరవాణిలు, రూ.5,880లు నగదు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా పేకాడుతూ తప్పించుకున్న మరో ఐదుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన ఇఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలీస్ లైన్ ఆవరణలోని 14, 15, 16 పోలింగ్ స్టేషన్లకు వెళ్లిన ఆయన అక్కడి సదుపాయాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై ఆయన అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎఇఆర్ఒలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.10 వేలు చొప్పున వేతనాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ బి.అబ్బాయికి వారు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కోరాడ రాము మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా మిడ్డే మీల్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలని, పని భద్రత కల్పించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు, అమరావతి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, గంగాభవాని, వై సత్యవతి, కే నాగరత్నం, జి అప్పలరాజు పాల్గొన్నారు.

సాగునీటి వనరులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్లో రబీ సీజన్లో సాగునీరు పంపిణీ ఇతర అంశాలపై జెసి సి.వి.ప్రవీణ్ ఆదిత్య ఇరిగేషన్, వ్యవసాయ, డ్రైయిన్స్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి ఆయకట్టు, ఏలేరు ఆయకట్టు, పంపా రిజర్వాయర్ కింద సాగుతున్న పంటల వివరాలు, సాగునీటి లభ్యత, కాలువల పరిస్థితులపై ఆయన ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు.

జెసి ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలోని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ రబీ సీజన్లో రైతులకు ప్రణాళిక ప్రకారం సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు ఇరిగేషన్, వ్యవసాయ, డ్రైయిన్స్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో నూరు శాతం వరి నాట్లు ప్రక్రియ పూర్తయిందని, గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద 53వేల ఎకరాలు, పంపా రిజర్వాయర్ కింద సుమారుగా 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు జెసి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం ఈ - క్రాప్ బుకింగ్ పూర్తయిందని, మిగిలిన రైతుల నుంచి కూడా ఈ-క్రాప్ బుకింగ్ వివరాల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్ఇ జి.శ్రీనివాస రావు, పెద్దాపురం ఇఇ డి.రాంగోపాల్, రామచంద్రపురం ఇఇ వి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మేకపై జంతువు దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో శనివారం తెల్లవారుజాము ప్రాంతంలో మేకపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి సగం కలేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఇప్పటికే గ్రామంలో క్షుద్ర పూజలు జరుగుతున్నాయని ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకున్న సమయంలో సగం మేక కళేబరం కనబడటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సమీపంలో నివసించే షేక్ భాషాకు చెందిన మేకపై గుర్తుతెలియని జంతువు దాడి చేసి సగం మాంసాన్ని తినేసి మేక కళేబరాన్ని వదిలేసి వెళ్ళిపోయింది. ఉదయం గ్రామస్తులు ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఇది జంతువు పనేనా?ఎవరైనా వ్యక్తులు కావాలనే ఇలా చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

కేంద్ర బడ్జెట్లో మొండి చేయి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మధ్యంతర బడ్జెట్లో జిల్లాకు పూర్తిగా మొండి చేయి తప్పలేదు. గత నాలుగేళ్లుగా ఊరిస్తూ ఉసూరు మనిపించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో తాయిలాలు ప్రకటించే అవకాశాలున్నాయని ఎదురు చూసిన వివిధ వర్గాల ప్రజలకు నిరాశే మిగిలింది. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పోటీ పడి మద్దతు తెలపడమే ఈ దుస్థితికి కారణమని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు ప్రతి జిల్లాకు ఒక ఎయిర్ పోర్టు అని వైసిపి అధినేత చెప్పిన విషయం విదితమే. కొత్త ఎయిర్పోర్టులు లేకపోగా రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు అభివృద్ధి ఆచరణలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కీలకమైన రైల్వే ప్రాజెక్టుల్లోనూ పురోగతి కరువైంది. పోలవరం ప్రాజెక్టుకు కేటాయింపులపైనా తాత్సారం తప్పలేదు. కాకినాడ పిఠాపురం ప్రధాన రైలు మార్గం అనుసంధానానికి గతంలో కేటాయించిన బడ్జెట్కు నామమాత్రపు కేటాయింపులు నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా మారింది. కేవలం వెయ్యి చొప్పున కేటాయించడం విమర్శలకు దారి తీసింది. కోటిపల్లి- నర్సాపురం రైలు మార్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం నిధుల లేమి వెంటాడుతోంది. రాష్ట్రం మీ వల్ల అంటే మీ వల్ల అప్పుల పాలైందని ఇటు అధికార వైసిపి, అటు టిడిపి విమర్శలు చేసుకుంటున్నాయే గానీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన నిధులను సాధించడంలో చిత్తశుద్ధి కరువైంది. కనీసం ప్రజల కోసం అయినా కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకించక పోవడం ప్రజలను ఆలోచింపచేస్తోంది.

టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ

టిడిపి, జనసేన ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అధికార వైసిపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు చక చకా ఏర్పాట్లు చేయడంతో ప్రతిపక్ష నేతల్లో కలవరం వ్యక్తమవుతోంది. వైసిపి ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాలతో పాటు పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జిలను ప్రకటించి వారే అభ్యర్థులను చెప్పకనే చెప్పింది. ఐ పాక్ సర్వేల ఆధారంగా సిట్టింగ్లకు స్థాన చలనం చేసి కొత్త స్థానాల్లో అదృష్టాన్ని పరీశించుకోవాలని తేల్చిచెప్పింది. దీంతో అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం ప్రారంభించేశారు. పరోక్షంగా తమను గెలిపించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థానలు చేసి తిరిగి అధికారంలోకి వస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి జాబితా ఇప్పటికీ విడుదల చేయలేదు. దీంతో అనేక నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గం ఎవరికి కేటాయిస్తారనే గందరగోళం నెలకొంది. టిడిపి జనసేన నేతల అంతర్యుద్ధానికి ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలో నిర్వహించిన రా కదలిరా సభ వేదికైంది. అధినేత ముందే రాజానగరంలోని టిడిపి, జనసేన నేతలు వాగ్యుద్ధానికి దిగటం విమర్శలకు దారి తీసింది.

విమర్శలకు దారి తీసిన పరీక్షల వాయిదా

వైసిపి నిర్వహించిన సిద్ధం కార్యక్రమం కోసం ఇంటర్మీడియెట్ పరీక్షను వాయిదా వేయటం విమర్శలకు దారి



తీసింది. ఏలూరులో శనివారం నిర్వహించిన సభకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాజరైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేయటంతో పాటు ఆర్టిసి బస్సులను సైతం సభకు తరలించారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని వైసిపి నేతలు తమ తమ నియోజక వర్గాల నుంచి ప్రజలను తరలించి అధినేత ఆశీస్సులు పొందేందుకు పోటీ పడ్డారు. ప్రజల ప్రయాణ అవసరాలను పక్కన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తూ నిర్వహించే ఇటువంటి సభలు ఏ మేరకు సహాయపడతాయో వేచి చూడాలి.

ఓట్ ఫర్ ఒపిఎస్ సభ విజయవంతం

ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నిర్వహించిన ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమం విజయవంతమైంది. సుమారు 3 వేల మంది వస్తారని అంచనా వేయగా 7 వేలకు పైగా ఉపాధ్యాయులు హాజరవటంతో ఎస్కెవిటి డిగ్రీ కళాశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికార వైసిపితో పాటు, ప్రతిపక్ష టిడిపి నుంచి ఒపిఎస్పై ఎటువంటి హామీ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్లు ప్రకటించారు.



మాట్లాడుతున్న శాంతకుమారి

6న సర్పంచ్ల 'చలో అసెంబ్లీ'

ప్రజాశక్తి-అంబాజీపేట

ఎపి పంచాయతీ రాజ్ చాంబార్ మరియు ఎపి సర్పంచుల సంఘం పిలుపు మేరకు డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 6 న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించి, అసెంబ్లీ ముట్టడిస్తామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతాకుమారి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి రంబాల రమేష్ పిలుపునిచ్చారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 14,15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,629 కోట్లు దారి మళ్లించిన నిధులు ఖాతాలలో జమ చేయాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలని, సచివాలయ వ్యవస్థను పంచాయతీల ఆధీనంలో పనిచేయాలని, తదితర 16 డిమాండ్ల పరిష్కారం కోసం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపిచ్చారు.

రైల్వే లైన్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ వేగవంతంగా పూర్తి చేయాలని జిఎంసి.బాలయోగి సాధన సమితి నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు.స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ ప్రవేశపెట్టిన నూతన రైల్వే బడ్జెట్లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వేలైన్ మరమ్మతులకు రూ.10 కోట్లు, కోటిపల్లి నుంచి నరసాపురం వరకూ రూ.300 కోట్లు నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులోకి తీసుకురా వాలన్నారు. ఈ సమావేశంలో సాధన సమితి నాయకులు నాగిడి నాగేశ్వరరావు, అరిగిన బలరామ మూర్తి, కర్రి రామస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించాలి

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా క్రీడలకు పెద్దపీట వేసిందని, క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి ఎస్ నుపూర్ అజయ్ ఆశీర్వదించారు. శనివారం ఆమె జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను స్థానిక జీఎంసీ బాల యోగి స్టేడియం నందు ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద క్రీడా సంబరంగా ఆడుదాం ఆంధ్రా నిలుస్తోందన్నారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడలో క్రీడా ప్రతిభా పాటవాలను చాటుతూ రాష్ట్ర స్థాయిలో రాణించి కోనసీమ జిల్లా యొక్క ప్రఖ్యాతులు రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేయాలన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటాలన్నారు. తగిన ప్రోత్సాహం ఉంటే క్రీడల్లో తాము రాణిస్తామంటూ క్రీడాకా రులు నిరూపిస్తున్నారన్నారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీల నిర్వహణ ప్రతిభ కలిగిన వారికి అనేక విధాలుగా సాయం అందిస్తూ క్రీడా అభివృద్ధికి విశేష కృషి రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎంతో పారదర్శ కంగా ఆహ్లాదకర వాతావరణం లో ఈ యొక్క పోటీలు ఐదు దశలలో ఐదు క్రీడాంశాలలో నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు బహూకరించారు.కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్, జిల్లా చేనేత జోలి శాఖ సహాయ సంచాలకులు రాజు, జిల్లా స్థాయి బంద సభ్యులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్

రవ్వ ప్లాంట్ వద్ద కొనసాగిన ఆందోళన

ఆందోళనకారులపై కేసుల నమోదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.యానాంలో ఉన్న వేదాంత ఆయిల్ కంపెనీ గ్రామ అభివద్ధిని విస్మరించి గ్రామ ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ నిరుద్యోగ యువత,గ్రామస్తులు శుక్రవారం ఉదయం నుంచి మొదలుపెట్టిన ఆందోళన రెండో రోజు శనివారం రాత్రి వరకూ కొనసాగింది. ప్లాంటు గేటు వద్దకు వెళ్లే ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి కార్మికులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అమలాపురం డిఎస్పి ఆదేశాల మేరకు రూరల్ సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ కెఎన్.జోషి ఆందోళనకారులపై కేసులు నమోదు చేశారు. రెండో రోజు ఆందోళనలో విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ, మాజీ ఎంపిపి జోగి అర్జునరావు, గ్రామస్తులు అయితాబత్తుల సూరిబాబు, పలచోళ్ళ బుజ్జి, ముత్తాబత్తుల శ్రీను, మెండి డేవిడ్, అంబేద్కర్, పినిశెట్టి నరసింహారావు, బుజ్జి,ఉండ్రు సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.యానాం రవ్వ ప్లాంట్ వద్ద ఆందోళనకారులు

నిరుద్యోగులను మోసం చేస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్రవ్యాప్తంగా 50,892 ఖాళీలుంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వైసిపి ప్రభుత్వం మోసం చేయడమేనని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన సిఎం జగన్ కు ఈ నాలుగున్నర సంవత్సరాల నుండి గుర్తుకు రాని నిరుద్యోగులు ఎన్నికలు కాబట్టి ఇప్పుడు గుర్తుకొచ్చారన్నారు. ఎన్నికల హామీల్లో హామీ ఏటా మెగా డిఎస్సి, జాబ్ క్యాలెండర్, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు టిడిపి ఉంగరాల రాంబాబు, వాకచర్ల గుప్తా తదితరులు పాల్గొన్నారు.

6100 టీచర్ పోస్టుల ప్రకటన సిగ్గుచేటు

మామిడికుదురు సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావిడిగా వైసిపి ప్రభుత్వం కేవలం 6100 పోస్టులు మాత్రమే ప్రకటించడం సిగ్గుచేటని జెడ్పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికైనా యువత భవిష్యత్తు బాగుండాలంటే చంద్ర బాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని నామన అన్నారు.

'విద్యార్థుల జీవితాలతో సిఎం జగన్ ఆటలు'

అమలాపురం సిద్ధం సభ కోసం ఇంటర్మీడియట్ పరీక్ష వాయిదా వేసి విద్యార్థుల జీవితాలతో సిఎం జగన్ ఆడుకుంటున్నారని అమలాపురం అసెంబ్లీ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. శనివారం పట్టణంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు స్వగృహం నందు అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో 'మెగా డిఎస్సి కాదు.. దగా డిఎస్సి, తదితర అంశాలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు తిక్కరెడ్డి నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామి నాయుడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చేట్టి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగములో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. రెండవ రోజు యూనివర్సిటీ అఫ్ పెట్రోనస్, మలేషియాలో అసోసియేట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇరైవన్ ఇలమ్ వరుతీ ఆన్లైన్లో ఇంటిలిజెన్స్ పరిశోధన విభాగంలో మెలకువలని వివరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్. రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'ను సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయాన్నిశనివారం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె ప్రత్యూష కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, శిక్షణా ప్రణాళిక తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, ఆట స్థలం, టాయిలెట్స్, డార్మీటరీలు, భోజనశాల, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారాన్ని రుచి చూశారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, జీవశాస్త్ర విభాగం, కాకినాడ మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ మరియు పీజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, క్యాంపస్ ఇన్చార్జ్ ఎన్.మూర్తి మాట్లాడారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. **కాకినాడరూరల్** స్థానిక మెడికవర్ హస్పటల్లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మురళీధర్ ప్రసంగించారు.

కొత్తపేట తహశీల్దార్గా ఎలీషా

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట తహశీల్దార్గా జి.ఎలీషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం నుంచి కొత్తపేట మండలం తహశీల్దార్గా బదిలీపై వచ్చారు. ఇంత వరకు కొత్తపేటలో పనిచేసిన జిడి.కిషోర్ బాబు ఎన్టిఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎలీషాను డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఏడుకొండలు సిబ్బంది ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జి.ఎలీషా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'ఓట్ఫర్ ఒపిఎస్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

సిపిఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అలా అమలు చేసే వారికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో మా కుటుంబాల మద్దతు ఉంటుందని కార్యాచరణలో భాగంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం అమలాపురం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఎం టివి సుబ్బారావు ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎవరైతే ఒపిఎస్ అమలుకు స్పష్టమైన హామీ ఇస్తారో ఆ పార్టీకే ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాల మద్దతు ఉంటుందన్నారు. ఒపిఎస్ పునరుద్ధరణ పై మేనిఫెస్టో లో చేర్చి పార్టీ వైఖరిని బహిరంగంగా ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు.

